# మారిన మనసు

## కుమారి కోకా ఇందిరాదేవి

సముద్రానికి దగ్గరగావున్న ఆ బంగళాలో ఆ వేళ చాలా కోలాహలంగా వుంది. ప్రొద్దుటినుండి అతిథులకోసం ఎన్నో ఏర్పాటు చేస్తున్నారు. అరవిందకు ఆ రోజు కాలేజీ శెలవైనందున తానే స్వయంగా దగ్గరవుండి అన్నీ సక్రమంగా చేయిస్తున్నది. హాల్లో రంగుల ఎలక్ట్రిక్ బల్బులు పెట్టేందుకు బల్ల వేసుకు ఎక్కినా అవి చేతికి అందక అవస్థపడుతూంది.

అప్పుడే మెట్లెక్కి పైకివచ్చిన సుధాకర్ ఆమెను చూసి చిరునవ్వుతో అన్నాడు:

"అవి అందుకోడానికి నీ ఎత్తు కొంచెం పొడుగు ఎదగాలి అరవిందా."

గిరుక్కున వెనుదిరిగి అంది అరవింద:

"హమ్మయ్య! సమయానికే వచ్చావు. ఇందాకటినుండీ తిప్పలు పడుతున్నాను వీటితో. కాస్త బల్బులు వేసి పెడుదూ."

సుధాకర్ సంతోషంతో అంగీకరించాడు ఆ పని చేసేందుకు. ఆ ఇంట్లో స్వంతమనిషిలాగే మెలుగుతాడు అతను. వారిలో ఒకడుగా కలసిపోవాలనే అతని కోరిక. అతనికి ఆ ఇంట్లో ఎప్పుడూ సుస్వాగతమే. సుధాకర్ "లా" చదువుతున్నాడు మంచి స్ఫురద్రూపి. అంతే కాకుండా చదువులోనూ, ఇతర విషయాల్లోనూ తెలివైన సుధాకర్ అంటే ఆ ఇంట్లో అందరికీ అభిమానం, అనురాగమూను. ముఖ్యంగా ఇంటి యజమాని అయిన ప్రొఫెసర్ గారు మాత్రం అతని మంచితనాన్ని, సద్గుణాలనీ చూసి చేరదీశారు. సుధాకర్ ఇంటరునుండీ ఆ ఊళ్ళోనే చదువుతున్నాడు. అతను ఏ వూరివాడో! ఎక్కడినుండి వచ్చాడో, తల్లిదండ్రులెవరో ఎవరికీ తెలియదు. ప్రొఫెసర్ గారు ఆ విషయం అడిగినప్పుడు కూడా అతను సంకోచించాడు. అంతే. మళ్ళీ ఆయన ఆ విషయం ప్రస్తావించలేదు. అతని మంచి మార్కులు చూసి స్కాలర్ షిప్ కూడ ఇప్పించారు.

ప్రొఫెసర్ గారమ్మాయి అరవింద, సుధాకర్ ఇంటర్ నుండి క్లాస్ మేట్సు. వారిద్దరూ చాలా స్నేహంగా వుంటారు. సుధాకర్ తీరిక సమయాల్లో వీరింట్లోనే కాలం గడుపుతాడు. అతనికి ఇక్కడ చాలా చనువు.

ఆ వేళ ప్రొఫెసర్ గారింటో లక్ష్మీపూజ జరిగింది. ఆ సాయంత్రం అరవింద తన స్నేహితులను టీపార్టీకి ఆహ్వానించింది. అందుకే అంత కోలాహలం. సుధాకర్ ని ఏదేనా సహాయం చేయడానికి త్వరగా రమ్మని ముందురోజే చెప్పింది.

క్రమంగా సంధ్యచీకట్లు అలుముకుంటున్నాయి. పిల్లగాలులు మెల్లగా వీస్తూంటే కొంపౌండులోని పారిజాతపూవులు సొమ్మసిల్లి రాలిపోతున్నాయి. అతిథులు ఒక్కొక్కరే వస్తున్నారు. అరవింద మందహాసంతో ఎదురేగి వారిని ఆహ్వానించి సుఖాసీనులను చేస్తూంది.

సుధాకర్ ఇంకా ఆ కలర్ లైట్లు అమర్చడంలో సతమతమవుతున్నాడు. అంతలో అక్కడికొక మందహాస సుందర వదనారవిందం వచ్చింది. అతని కళ్ళు తటుక్కున మెరిసి అటు చూశాడు. ఒక యువతి వయ్యారంగా నడుస్తూ వస్తూంది. ఆమెలో సామ్రాజ్ఞిలాంటి దర్పం, సౌందర్యం, గాంభీర్యం మూర్తీభవించినట్టున్నాయి. సుధాకర్ తాను చేస్తూవున్న పని మరచి, చుట్టూవున్న వాళ్ళు ఏమైనా అనుకుంటారనైనా లేకుండా అటువేపే కొద్ది నిముషాలు చూస్తూవుండిపోయాడు.

లోపలనుండి వస్తున్న అరవింద ఆమెను చూసి చేతిలోని ట్రే బల్లపైనుంచి గబగబా వాకిట్లోకివచ్చి అంది "రా ప్రతిమా రా! బయటే నుంచునిపోయావేం? ఇక్కడెవరూ కొత్తవారులేరు సిగ్గుపడేందుకు." అని చేయిపుచ్చుకుని లోనికి తీసుకువెళ్ళి సోఫాలో కూర్చుండబెట్టింది.

పని పూర్తి చేసికూడా టేబుల్ పై బొమ్మలా చూస్తూ నుంచున్న సుధాకర్ ని చూసి అంది. "సుధాకర్! ఈవిడే నేను నీకు మొన్న చెప్పిన అమ్మాయి ప్రతిమ. కొత్తగా వచ్చిన తాసిల్దారు గారి అమ్మాయి. మన కాలేజీలోనే జాయినయింది." అని తిరిగీ ప్రతిమవైపు తిరిగి సుధాకర్ నికూడా పరిచయం చేసింది.

అతను మేలుకున్నట్టు బల్ల దిగివచ్చి "ఓహో! అలాగా" అంటూ ఆమెకు నమస్కరించాడు. ప్రతిమకూడా ప్రతినమస్కారం చేసింది చిరునవ్వుతో.

అక్కడి వారందరూ కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. అరవిందా, ప్రతిమా కూడా ఏవో చెప్పుకుని కిలకిలా నవ్వుల్లో మునిగిపోయారు.

సుధాకర్ కి ఏమీ తెలియడం లేదు అతను ఊహాప్రపంచంలో తేలిపోతున్నాడు. అబ్బా! ఈమె నిజంగా ప్రతిమలాగానే వుంది. ఎప్పుడో చిన్నతనంలో కథల్లో చదివిన దేవతాస్త్రీవలె ఎంతసుకుమారంగా వుంది ఆ వనితామణి. నిజంగా ఆమె నవ్వుతూంటే నవరత్నాలు రాలినట్టే. ఆ నవ్వు గదిలో వెయ్యి వజ్రాల కాంతి నింపినట్లయింది. ఇక ఆ సుందరి కన్నీరు నింపితే ఎలా వుంటుంది? ఎవరికోసం ఆమె కంటి ముత్యాలు రాలుస్తుందో, అతను మహా గొప్ప అదృష్టవంతుడై వుంటాడు.

అతని ఆలోచనల్ని చెదరగొడుతూ అంది అరవింద. "చూశావా ప్రతిమా? సుధాకర్ ఎక్కడున్నా అతని మనసుమాత్రం చదువు మీదే లగ్నమై ఉంటుంది. ఎప్పుడూ పాఠాల్ని గూర్చే ఆలోచిస్తూంటాడు. అందుకే పరీక్షలో ఫస్టుమార్కులు అతనివే."

"అదే, మీ వద్దనుండి నేనూ నేర్చుకోవాలనుకుంటున్నాను." నవ్వుతూ అంది ప్రతిమ.

సుధాకర్ ఆడపిల్లలా సిగ్గుపడిపోయాడు. తను అన్యమనస్కంగా వుండడం వీళ్ళు గ్రహించారని బెదరాడు. అయినా తనలో తెలియని ఆనందం, గర్వం పొందాడు. కొద్దిగా ముఖం పైకెత్తి వారికేసి చూపులు నిలిపి అన్నాడు. "అలా అనకండి. నేను అంతటి గౌరవం పొందడానికి తగనేమో" ప్రతిమా, అరవిందా అతనివైపు వింతగా చూసి, మళ్ళీ తిప్పుకొని ఏవో కబుర్లలోకి దించారు సుధాకర్ ని.

రాత్రి ఎనిమిది గంటలు దాటింది. అతిథులు చాలామటుకు వెళ్ళిపోయారు. ప్రతిమకూడా వెళిపోయింది తన కారెక్కి. ప్రొఫెసరుగారు వచ్చేవరకు వుండి శెలవు తీసుకుని, తానూ తన గదికి బయలుదేరాడు సుధాకర్.

సూర్యుడు అస్తమించిన చాలాసేపటివరకూ ఆకాశంలో సంధ్యారాగం నిలచిపోయినట్టే, ప్రతిమనిష్క్రమణానంతరం

# మారిన మనసు

కూడా సుధాకర్ హృదయంలో ఆమె సౌందర్యం నిండిపోయింది. ఆమె మూర్తి అతని హృదయంలో చెరగని ముద్రవేసింది. ఆ అందాల రాశిని, స్మృతిపథంనుండి ఎలా తొలగించుకోవాలో తెలియక ఆరాటపడుతున్నాడు.

ఆనాటినుండి తరుచూ అరవింద ఇంటికి వస్తూండేది ప్రతిమ. ఒకొక్కసారి సుధాకర్ ఆసమయంలో అక్కడుండేవాడు. అతనితో ఎంతో ధారాళంగా, చనువుగా మాట్లాడేది ఆమె. వారు ముగ్గురూ తమ కాలేజీ, పాఠాలు, సినిమా ప్రపంచంనుంచి రాజకీయాల దాకా గంటలకొద్దీ తర్కించుకొనేవారు. ప్రతిమ సుధాకర్ తెలివితేటలకు ఏమీ తీసిపోదు. పట్టుదల ఎక్కువ. ముఖంలో అదోమాదిరి గర్వం, అహంభావం తొణికిసలాడుతుంటుంది. ఏదేనా వాదించి తానే నెగ్గాలనే స్వభావం గలది. కొన్ని సమయాల్లో ఆమె మనసు నొచ్చుకుంటుందేమో అని ఆమె తీర్మానాలను ఆమోదించేవాడు సుధాకర్.

ఇంత తెలివైన సుధాకర్ ప్రతిమకు లొంగిపోవడం అరవిందకు బాధ కలిగించేది. కానీ ఏమీ అనలేక తన సలహా అడిగినప్పుడు మాత్రం ఉభయపక్షాలకు సంబంధించినట్లు, "అంతేనేమో" అనేది మెల్లగా. అరవింద సహజంగా, నెమ్మదైనది. చూపులకు ప్రతిమలాగ విద్యుల్లతవలె మెరవకపోయినా, ఆమెలో చూడచక్కని అందం, ముగ్ధత్వం ఇమిడివుండి, సహజమైన ఆకర్షణవుంది ఆమె స్నేహమయి. ఓర్పు, సహనం ఆమె సొత్తు. సుధాకర్ ప్రతిమతో చాలా సన్నిహితంగా మసలడం ఆమెను కలతపరిచేది. ఇదవరకు ప్రతినిత్యం తమ ఇంటికి వచ్చే సుధాకర్, ఇప్పుడు ప్రతిమ ఇంటికే దారి తీస్తున్నాడు. తనతో, ఆమెతో ఒక్కలాగే సంచరిస్తున్నాడు. అతని ప్రవర్తన అర్థం చేసుకోలేకుండావుంది తను. "ఒకవేళ ప్రతిమను ప్రేమిస్తున్నాడేమో! అప్పుడు నేనేం చేయాలి? చాలాకాలంనుండి నేనే అతన్ని ప్రేమిస్తున్నానని చెబితేనో? ఎలా చెప్పడం? ఒక స్త్రీ తనంతట తాను అలా బయల్పడితే, అతనేమనుకుంటాడు? అయినా, లోకువయిపోనూ? అయితే మనసులో వాంఛ తెలియజేయకుండా, నా ఆశల్ని చంపుకోడమేనా కర్తవ్యం? పోనీ నాన్నగారితో చెప్పిస్తే. అయ్యో! ముందు అసలాయనకు ఎలా చెప్పడం? పోనీ ఆయనే అడిగితే ఎంత బాగుండును?" ఈ సమస్యలతో హృదయంలో నే పోరాడేది అరవింద.

సుధాకర్ అందచందాలు, తెలివితేటలు చూసి ప్రతిమకూడ అతనంటే అభిమానం, అనురాగం ఏర్పరచుకుంది. తన అభిరుచులకు తగినవాడుగానే కనిపిస్తున్నాడామెకు. అతన్నే చేపడితే తన ఆశయం నెరవేరుతుందేమో అనే భావన కలిగింది.

ప్రతిమ తలిదండ్రులకు ఏకైక సంతానం, గారాలపట్టి; ఆమె మాటకు ఎదురులేదు. ఎంతంటే అంతే. ఆమె తల్లితండ్రులు వివాహం చేసుకోమని చాలా రోజులనుండి ప్రాధేయపడుతున్నారు. ఆమె "ఊఁ" అంటే వెయిమంది వచ్చి వాలే పరిస్థితులున్నాయి. గానీ ఆమె "ఇప్పుడే కాదు" అని కాలం జరుపుతూంది. ఇప్పుడు తాను అడిగితే సుధాకర్ నిరాకరించడని ఆమెకు పూర్తి నమ్మకం కుదిరింది. ఈ విషయం అతనితో నిశ్చయించుకునే పెద్దలకు చెబుదామని ఉపక్రమించింది. ఆమె ఏదేనా తలుచుకుంటే, నిర్భయంగా, సూటిగా ప్రశ్నిస్తుంది. ఆ వేళ సాయంత్రం అతను రాగానే అంది.

"మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడదలిచాను సుధాకర్."

"అంటే...", తెల్లబోయి అర్థోక్తిలో ఆగాడు.

"అంటే... పైకి రండి చెబుతాను," అంటూ డాబా పైకి తీసుకువెళ్ళింది అతనిని.

అక్కడ, తను అనుకుంది సూటిగానే అడిగి అంది, "ఇందు కేమీ అభ్యంతరం లేదుగా? సమ్మతి మేనా?"

ఆ అమృతవాక్కులకు అతని సందేహాలన్నీ పటాపంచలైనాయి శశిబింబంలాంటి ఆమె ముఖం చూస్తూంటే మనస్సు పాలసముద్రమయి, కన్నులు విచ్చిన పూరేకులైనాయి. ఈ సంతోష తరంగాల్లో కొద్ది క్షణాలు మూగవాడయ్యాడు. అతని కంతా ఇంద్రజాలంలా వుంది తాను ప్రతిమతో కలసి. మెలసి వున్నా, అమాంతం ఇంత అదృష్టవంతుడవుతాననుకోలేదు. పెదవుల మీద చిన్న నవ్వుతో సమాధానం ఇచ్చాడు.

"నా హృదయం విప్పి తెలుసుకున్నట్లు నీవే అడిగావు ప్రతిమా! నీకే అభ్యంతరం వుంటుందేమో అని నేను అడిగేందుకు సంకోచించాను."

"దేనికి నా అభ్యంతరం?" నిష్కర్షగా అడిగింది, ప్రతిమ.

'ఇక్కడ నా విషయం, వివరాలు కొన్ని చెప్పాలి నీకు. నా స్థితిగతులు తెలుసుకుని



కృష్ణా లేబరేటరి, బెజవాడ




RATNAM'S 'N' OIL
సేవించిన పూర్తి సంతోష సౌఖ్యము లనుభవించగలరు. 1 సీసా రూ. 11-4-0.
ఎడ్రస్సుతో జాబు వ్రాయండి.
డాక్టర్. రత్నం సన్స్,
తిలక పేట బిల్డింగ్స్, హైద్రాబాదు -2.

నీవు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. ఇది ఒకనాటి సంబంధం కాదుగా...."

"అంటే. సరిగ్గా చెప్పండి." అదేదో తక్షణం తెలుసుకోవాలన్న ఆత్రుతతో అడిగింది.

సుధాకర్ చెప్పుకుపోతున్నాడు.

"నాకు ఆస్తి పాస్తి లేమీ లేవు. ఈ నా చదువే నా కాధారం. ముఖ్యంగా నీకు చెప్పాలిసింది. నేను హరిజన యువకుడిని. విద్యమీది వ్యామోహం చేత, ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కొని, కడతేరుతానని మా తల్లికి వాగ్దానం చేసి, పూనుకు చలివచ్చాను. కొందరి పుణ్యాత్ముల దయకు పాత్రుడనై ఇప్పటికి ఇంతటివాడనవగలిగాను. ఇంతవరకూ ఈ సంగతిని గుప్తంగానే వుంచాను..."


ఒక లిప్తపాటు ప్రతిమ గంభీరత వహించింది. ఊర్ధ్వముఖంగా చూస్తూ వుండిపోయింది. కుటుంబ శ్రేయస్సు, వంశ గౌరవం మంటకలుపుతున్నావని ఘోషించింది ఆమె హృదయం! ఈ సంగతి ఇంటో తెలిస్తే, ఎంత రగడ అవుతుందో ఊహించుకోలేకపోయింది. అతనిపై ఒకవిధమైన ద్వేషభావం వుదయించింది. తనను నమ్ముకుని, తనమీద ఆశ లుంచిన తల్లిదండ్రులను అన్యాయం చేసి ఇందుకు ఎలా సమ్మతించడం? అయినా ఆ మాట తనకే బాగా లేదు. ఇంకెలా సహకరించగలదు? ప్రతిమ ఈ తలపోతలనుండి ఒక ఒడ్డుకు చేరి అంది.

"సరే ఈ విషయం నాన్నగారికి తెలియజేస్తే..." అంటూ అసంపూర్ణ వాక్యంలోనే తన సంశయాన్ని వ్యక్తపరిచింది.

ఆమెలోని కలవరపాటు గ్రహించిన సుధాకర్ అన్నాడు, "ఆ! బాగా ఆలోచించి నిర్ధారణ చేసుకో.

ఈమాటలు పైకి ధైర్యంగా అన్నాడే కాని, లోపల దిగులుగా వుంది. అసలు ఈ సంగతి ఎందుకు బయట పెట్టానా? అనే భావం బయలుదేరింది. మళ్ళీ నిజం దాచడం కంటే, సత్యం చెప్పటమే మంచిదని ఇంకో మందలింపు కలిగింది

ఈ చర్చ జరిగిన తర్వాత, ప్రతిమ వద్ద నుండి పిలుపు అందేవరకూ అటు వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు సుధాకర్. ఆనాటి ఆమె ప్రవర్తన ముఖకవళికలనుబట్టి, కార్యం సానుకూలం కాదనే గ్రహించాడు. కాని ఎక్కడో ఆశారేఖలు పొడచూపుతున్నాయి. మొదటి చూపులోనే ప్రతిమను తన హృదయేశ్వరిని చేసుకోవాలని వాంఛించాడు. ఆ ప్రథమవీక్షణం ఎటువంటిదో కాని అప్పటినుండి ఆమెను తనయెదలో చోటు చేసి అనురాగం పెంచుకున్నాడు. ఆమె



లేపాక్షి శిల్పసౌందర్యం

—ఫోటో: డా॥ ఆర్. ఆర్. కె. మూర్తి.

తప్ప తనకింకోలోకమే లేనట్లు అనుక్షణం కలలుకనేవాడు. నవీనవాతావరణం, నవీన పద్ధతులలో పెరిగి, విద్యాసంస్కారం గల ప్రతిమ, ఇలాంటి చిన్న విషయాలను ధైర్యంగా ఎదుర్కొని, ప్రేమకోసం నిలబడగలదని ఆశించాడు.

ఈ సంఘటన అతడిని పూర్తిగా పిచ్చివాడిని చేసింది. కాలేజీ కూడా మానేసి తన రూం, కిటికీలో కూర్చుని సముద్రం కేసి వెర్రిగా చూసేవాడు. స్నేహితుల బలవంతాన కాలేజీకి వెళ్ళినా బుర్ర సరిగా పనిచేయక తిరిగీ రూం చేరేవాడు.

ఈ స్థితిలో కొంతకాలం గడిచింది. పరీక్షలు దగ్గరపడుతున్నాయి. సుధాకర్ టేబుల్ ముందు కుర్చీలో కూర్చుని, ఎంతకీ లొంగని మనస్సుని స్వాధీనంలోకి తెచ్చి పుస్తకం తీసి బలవంతంగా దృష్టి నిలిపి, చదవడానికి యత్నం చేస్తున్నాడు.

అంతలో అతనికి క్యారియర్ తెచ్చే కుర్రాడు వచ్చి, "బాబూ! ఈ జాబు మీకివ్వమని ఎవరో ఇచ్చారు," అంటూ ఓ గులాబీ రంగు కవరు అందించాడు. ఆ దస్తూరీగా అంచుకుని అడ్రసు చూశాడు సుధాకర్. తనకే. ప్రతిమదస్తూరి. హృదయం ఎగిరిగంతేసింది. అయినా అందులో ఏ వార్త వుంటుందోనని ఆరాటపడ్డాడు. పరిపరివిధాల అనుమానాలు కలిగించే మనసుతో కవరు విప్పి చదువనారంభించాడు.

డియర్ సుధాకర్,

ఆరోజు సంఘటన మీకు అనుకోని పెద్ద విఘాతం కలిగించినందుకు ఎంతో చింతిస్తున్నా. నిమ్నజాతివారైన మీతో మన దాంపత్యానికి మా పెద్దలు అంగీకరించరని తెలిసి, ఆ విషయం వారితో ప్రస్తావించలేదు. మాది సనాతనాచారాలతో కూడిన కుటుంబం" నాకా పూర్వపద్ధతులూ, నమ్మకాలూ పూర్తిగా లేకపోయినా, అయినవారి మనస్సులు కష్టపెట్టడానికి సమ్మతించలేక పోతున్నాను. ఇందుకే, నా ప్రేమను త్యాగంచేసి నేను మెడికల్ పూర్తిచేసిన మా శాఖ వ్యక్తిని వివాహం ఆడేందుకు సిద్ధపడ్డాను. ఇందులో నా స్వార్థంతప్ప విశిష్టత ఏమీ

# ★ మారినమనసు ★

లేదని మీ రూహించవచ్చు. అందుకు నేను బాధ్యురాలిని కాదు. ఈనాచర్యను దయతో క్షమించి, సహృదయంతో ఆశీర్వదించ మని కోరుకున్నాను. మంచి వేళ మనకు పరిచయమైంది. అలాగే స్నేహితులుగానే విడిపోగలమని ఆశిస్తున్నాను. త్వరలో శుభలేఖ పంపుతాను.

ప్రతిమ.

ఈ లేఖ చదివి అతను భారంగా నిట్టూర్చాడు. తనకిక జీవితంలో వెలుగు లేదని అనుకున్నాడు. తొందరపడి ఊహాసౌధాలు నిర్మించుకోడం వెర్రితన మనిపించింది. రెండుకళ్లూ గట్టిగామూసి కుర్చీలో వెనక్కి జార్లపడ్డాడు.

"సుధ బాబూ" సన్ననికంఠం వినిపించి తలుపు చప్పుడయింది.

కానీ సమాధానం చెప్పే స్థితిలోలేడు. మళ్ళీ మళ్ళీ ఆగొంతుకే సున్నితంగా వినిపిస్తోంది. ఈ సమయంలో తన ఏకాంతానికి భంగం కలిగిస్తున్నందుకు విసుగూ, కోపమూ జనించాయి. కానీ అదీ వ్యక్తపరచలేకపోయాడు. "తలుపు తీసేవుంది లోనికి రావొచ్చు" అనిమాత్రం అన్నాడు మెదలకుండా.

"అలా వున్నావేం? వంట్లో బాగాలేదా?" అడిగిందా కంఠం.

భారంగా రెప్పలు మూస్తూ, తీస్తూ తెరిచాడు. సరిగా సర్దుకు కూర్చుని ప్రక్కన కుర్చీ చూపించి అన్నాడు కనుబొమలు పైకెత్తి.

"కూర్చో అరవిందా. ఏం? ఇలా వచ్చావు? పక్కదాని వేనా?"

"ఆ! ఏం రాకూడదా?"

"అలా అనలేదు. ఎప్పుడూ లేంది....."

"ఇప్పుడొచ్చాను నీ రూముకి."

...............

"నీవు చాలా మారిపోతున్నావు సుధాకర్!" తలదించి చేరకుచ్చిళ్లు చూసుకుంటూ అంది.

విషాదంగా నవ్వి అన్నాడు "అలా కనిపిస్తున్నానేమో!"

"ఏమో వేంటి? స్పష్టంగా తెలుస్తూంటే. అన్నిట్లో పూర్తిగా మారిపోయావు. నీ తీరే వేరయింది. మనోవ్యాధితో సగమవుతున్నావు."

"నా కేం మనోవ్యాధి అరవిందా?"

"ఇంకా రహస్యంగా వుంచాలని వ్యర్థప్రయత్నం చేయకు సుధాకర్! నాకు అన్నీ తెలుసు. కుల గోత్రాల మీద నమ్మకమున్న ప్రతిమ నిన్ను కాదన్నదని, నీ భవిష్యత్తుని విషాదాంతం చేసుకోకు. చదువులో కూడా అశ్రద్ధచేస్తున్నావని విన్నాను. నీ శ్రేయస్సుకోరి నీ మీద అభిమానముగలవా రున్నారని తెలుసుకో."

తన చేతినుండి జారి క్రిందపడిన ఆ ఉత్తరాన్ని అమెకిస్తూ అన్నాడు సుధాకర్.

"నాలాగే తొందరపడి మాట్లాడుతున్నావు నీవు. నా పూర్తి వివరాలు తెలుసుకో. నీతల్లిదండ్రులు కూడా అంగీకరించలేరు."

ఉత్తరం చదివి బల్లమీదుంచుతూ అంది ఆమె.

"ఇందులో ఉన్నదానికంటే నాకు అన్నీ వివరంగా తెలిపింది ప్రతిమ. మావాళ్ళ అనుమతిమీదనే, నేనిక్కడకు రాగలిగాను. నాన్నగారు నాయిష్టాని కడ్డురారు. ఇన్నాళ్లు మీయిద్దరిమధ్య అడ్డురావడం తగదనే తొలగిపోయాను. కానీ పరిస్థితి నీకు వ్యతిరేకించింది. దీంతో నీవెంత వ్యథ ననుభవిస్తున్నావో నేను గ్రహించగలను. అందుకే స్త్రీనయివుండీ ధైర్యంతో స్వయంగా నీవద్దకు వచ్చాను."

"వద్దు, వద్దు, ఈ భేషజాలు నీకు. పిచ్చిదానివై పోకు అరవిందా" అన్నాడు సుధాకర్ దృఢంగా.

ఆ స్వరానికి బెదరి కళ్ళనీరు నించింది. పరధ్యాన్నంగావున్న అతడది గమనించలేదు.

ఆమె ఆలోచనలు ప్రతిమవైపు నడిచాయి "ఆ పేరులోనే సౌందర్యం ప్రస్ఫుటమవుతున్నది. ఆమె అతనికి హృదయాధికారిణి ఆమె ఎక్కడ? తానెక్కడ? ప్రతిమను ఎలా మరచిపోగలడు? అతన్ని ఆమెనుండి మరల్చడం తనతరంకాదేమో! ఈ విషయం ఇంత విస్పష్టంగా తెలుస్తున్నా ఆ ప్రయత్నం విరమించలేకుండావుంది తను. గద్గదకంఠంతో అంది:

"ప్రతిమలా నేను అందంగా లేననా సుధాకర్?" ఆమె కన్నీళ్లు చూసి బాధపడ్డాడు. ఆమె తలమీద మృదువుగా చేయివేసి అన్నాడు.

"ప్రతిమ సౌందర్యం నిరంధకుసుమం లాంటిదని తెలుసుకున్నాను. నాకు నీలాంటి స్త్రీయే కావాలి. నా కష్టసుఖాల్లో సమభాగినిగా వుండి, నన్ను ప్రేమించి; నాచేత ప్రేమించబడే అరవిందె నాకు కావాలి. నా సంతోషంలో ఐక్యమయే నీవే కావాలి. నిన్ను ఇంతకాలం అర్థంచేసుకోకుండా నీ కోమలహృదయంలో గాయం కలిగించిన మూర్ఖుణ్ణయాను. నన్ను క్షమించగలవా అరవిందా?" ఆమె రెండు చేతులూ పట్టుకుని తలవంచుకున్నాడు.

తృప్తిగా నవ్వి, మోమెత్తి అతని చూపులతో చూపులు కలిపింది అరవింద. ★


# జీవితంలో మహోల్లాసం




## కాల్గేట్
బొరేటెడ్
బేబీపౌడర్ వాడకంతో

...అందుచేతనే, విజ్ఞులైన తల్లులు తమ పిల్లల అతి సుకుమార శరీరాన్ని బాధాకరమైన చర్మవ్యాధులు సోకకుండా రక్షించడానికిగాను **కాల్గేట్ బొరేటెడ్ బేబీ పౌడర్** వాడతారు. అతి సున్నితమైన శరీరాలను మృదువుగా, లాలిత్యంగా వుంచడానికి శాస్త్రీయ పద్ధతులపై తయారుచేయబడింది. తాపమెక్కే ఎండ వేడిమికి చర్మం పెట్లకుండా కాపాడుతుంది ... ...రోజంతా చల్లదనమిచ్చి, పిల్లలు సుఖంగా వుండటాని కుపకరిస్తుంది. దాని కమ్మని వాసన మిమ్ము, మీ పిల్లలను సమ్మోహితులను చేస్తుంది.

BPG17 ఆదాకు జెయింట్ సైజు కొనండి



## నారసింహ లేహ్యము




బంగారుతో చేరినది. మేహము నిస్త్రాణ, విస్పృత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20తు. డబ్బీ రూ, 3-4-0 పోస్టేజి రు 1-1-0

పి. సి. ఏ. అండ్ కో., (ఆయుర్వేద సమాజం) పెరిదేపి (పోస్టు) — నెల్లూరు జిల్లా.